తొలి తెలుగు ఆధునిక కథానిక

'దిద్దుబాటు'

గురజాడ అప్పారావు

"**త**లుపు! తలుపు!"

తలుపు తెరవలేదు.

గదిలో గడియారం టింగుమని వొంటి గంట కొట్టింది.

"ఎంత ఆలస్యం చేస్తిని? బుద్ధి గడ్డి తిన్నది. రేపట్నుంచి జాగ్రత్తగా వుంటాను. యాంటినా చల్లా పోయి సానిదాని పాట సరదాలో మనసు లగ్నమై పోయింది. ఒక్క పాట సరదాతోటి కుదరలేదు. పాడే మనిషి మీదిక్కూడా మనసు పరుగెత్తుతూంది. లేకుంటే, నేను పోకిరి మనిషి లాగ పాట ముగిసిందాకా కూర్చోవడమేమిటి? ఏదో వొక అవకాశం కలగజేసుకుని దానితో నాలుగు మాటలు ఆడడపు ఆసక్తి ఏమిటి? యిదుగో, లెంపలు వాయించుకుంటున్నాను. రేపట్నుంచి పాటకు వెళితే వొట్టు – (వొట్టు వేసుకోరాదు. అదో నియమంవొచ్చింది కదూ) మరి వెళ్లను, నిశ్చయం, నిశ్చయం గట్టిగా గాని పిలిస్తినట్టాయనా, కమలిని లేవగలదు. మెల్లిగా తలుపు తట్టి రాముణ్ని లేపగలిగితినా చడీ చప్పుడూ లేకుండా పక్కజేరి పెద్దమనిషి వేషం వెయ్యవచ్చు.

గోపాలరావు తలుపు చేతనంటగానే, రెక్క విడబారింది. "అరే యిదేమి చెప్మా!" అనుకొని తలుపు మెల్లిగ తెరిచేసరికి, నడవలో దీపం లేదు. నాలుగిళ్ల వాకిలి దాటి, పడక గది తలుపు తీసిచూస్తే దాన్లోనూ దీపం లేదు. చడీచప్పుడూ లేకుండా అడుగువేస్తూ మంచము దరికిపోయి, కమలిని మేలుకొని వున్నదా, నిద్రించుతున్నదా అని కనిపెట్ట ప్రయత్నించెను గాని, యేర్పరించ లేక పోయినాడు. బల్లమీద తడివి అగ్గిపెట్టె తీసి ఒక పుల్ల వెలిగించాడు. మంచం మీద కమలిని లేదు. నిశ్చేష్టుడైపోయినాడు. చేతి నుంచి అగ్గిపుల్ల రాలింది. గదినీ, అతని మనస్సునూ చీకటి కమ్మింది. వెఱ్ఱి శంకలూ, అంతకు వెఱ్ఱి సమాధానాలూ మనసున పుట్టుతూ గిట్టుతూ వ్యాకులత కలగజేశాయి. బుద్ధి తక్కువ పని చేసినందుకు తనయందో, కానరామికి కమలినియందో యేర్పరింపరని కోపావేశం కలిగింది. నట్టి వాకిట వచ్చి నిలబడ్డాడు. చుక్కల కాంతిని నౌకరుగానీ, దాసీగానీ కానరాలేదు.

తిరిగి గదిలోకి పోయి దీపం వెలిగించి, గది నాలుముఖాలా పరికించి చూశాడు. కమలిని ఎక్కడా కానరాలేదు. వీధి గుమ్మం దగ్గిరికి వెళ్లి తలుపు తెరిచి చూసేసరికి, వీధి నడుమ చుట్ట కాలుస్తూ తల ఎత్తి ఆకాశం

మీది చుక్కల్ని చూస్తూ రావుడు కనపడ్డాడు! "రామా!" అని గోపాల్రావు పిలిచాడు. రావుడి గుండె జల్లుమంది; నోట్లో చుట్ట జారి కిందపడ్డది.

"రా వెధవా!"

కాలీడ్చుకుంటూ రావుడు దగ్గర కొచ్చాడు.

"మీ అమ్మేదిరా?"

"మా యమ్మా బబూ? మా కొంపల్నున్నాది."

"నీ అమ్మ కాదురా! బుద్ధిహీనుడా! నా భార్య రా."

ఆ మాటతో రావుడికి మతిపోయింది. ఆలోచించుకుని అన్నాడు –

"ఎక్కడుంటారు బాబూ? అమ్మగోరు గదిలో తొంగున్నారు బాబూ!"

"యింట్లో ఎక్కడా లేదురా, వెదవ! యిల్లు విడిచి నువ్వెక్కడికి పోయినావురా?"

రావుడు మొహం ఓరజేసుకుని "నౌఖరోడికి కాల్నొస్తుంది, కడుపు నొస్తుంది, బాబూ. పెద్ద య్యోరు మరీ మరీ అప్పసెప్పి ఎల్లినారు గందా, అమ్మగారి నౌక్కర్నీ ఒగ్గేసి నిసి రాత్రేళ సానమ్మ గారి–"

రావుడివీపుమీద రెండు వీశ గుద్దులు పడ్డాయి.

"సంపేసినారు బాబూ" అని రావుడు నేల కూలబడ్డాడు.

గోపాలరావు దయగలవాడు. వెంటనే కోపం దిగజారి, పశ్చాత్తాపం కలిగింది. రాముణ్ని చేత లేవనెత్తి, వీపు నిమిరి, కోపం పట్టలేక పశువువలె ఆచరిస్తిని" అనుకుంటూ గదిలోకి తీసుకువెళ్లాడు.

కుర్చీమీద తాను కూచుని "రామా ఏమా యెరా! యని దైన్యంతోటి అన్నాడు.

రావుడు యీ తట్టూ, ఆ తట్టూ చూసి

"ఏటో మాయలా వుంది, బాబూ" అన్నాడు.

"పుట్టింటిగ్గానీ వెళ్లి వుందునా?"

"అంతోరు కారనా, బాబూ? కోపగించితే నెప్పు జాల్నుగానీ, ఆడోరు సదువుకుంటే. ఏటా తది బాబూ?"

"విద్య విలువ నీకేం తెలుసురా, రామా!" అని గోపాలరావు మోచేతులు బల్లపైన ఆనిచ్చి; ఆ నడుమ శిరస్సు వుంచి తలపోస్తూ వున్నంతలో, ముద్దులొలికే కమలిని చేవ్రాలున వుత్తరవొకటి బల్లమీద కనపడ్డది. పైకి చదివాడు;

"అయ్యా!"

"ప్రియుడా!' పోయి 'అయ్యా' కాడికి వొచ్చిందా?"

"పెయ్య పోయిందా బాబూ?"

"మూర్ఖుడా! వూరుకో."

"అయ్యా! పది దినములాయె రాత్రుల నింటికి మీ రాకయే నే నెరుగను. మీటింగులకు బోవుచుంటిమంటిరి. లోకోపకారమునకై యుద్యమముల నిదురమాని చేయుచుంటిమంటిరి. మా చెలుల వలన నిజము మేర్చితిని. నేనింట నుండుటను గదా మీరున్న కల్లలు పలుకవలసి వచ్చెను. నేను పుట్టింటను మీ స్వేచ్ఛకు నిర్బంధమును, అసత్యమునకు అవకాశము కలుగకుండును. మీచే దినదినమును అసత్యమాడించుట కన్న మీ త్రోవకు అడ్డుగ నుండకుండుటయే, పతి మేలు కోరిన సతికి కర్తవ్యము కాదా? నేనీ రేయి కన్నవారింటికి చనియెద. సంతసింపుడు. వెచ్చముగాక ఏ పాటి మిగిలియున్న

దయనుంచుడు."

"ఉత్తం ముగించి "నేను పశువును" అని గోపాల్రావు అనుకున్నాడు. "అదేటి బాబూ, అలా శలవిస్తారు?"

"శుద్ధ పశువును."

రావుడు అతి ప్రయత్నం చేత నవ్వు ఆచుకున్నాడు.

"గుణవతి, విద్యవతి, వినయ సంపన్నురాలు, నా చెడు బుద్ధికి తగిన శాస్తి చేసింది."

"అమ్మగారేటి సేసినారు బాబూ!"

పుట్టింటికి వెళ్లిపోయింది – గాని, నీకు తెలియకుండా ఎలా వెళ్లిందిరా?"

రావుడు రెండడుగులు వెనక్కి వేసి, "నా తొంగున్నాను కావాల బాబు! అలిగితే సెప్పసాల్ను గాని బాబు, ఆడదాయి సెప్పకుండా పుట్టినోరింటికి ఎల్తానంటే లెంపలోయించి కూకోబెట్టాలి గాని మొగోర్లాగా రాతలూ, కోతలూ మప్పితే ఉడ్డోరం పుట్టదా, బాబూ?"

"ఒరి మూర్ఖుడా! భగవంతుడి సృష్టిలోకల్లా ఉత్కృష్టతమయిన వస్తువు విద్యనేర్చిన స్త్రీ రత్నమే. శివుడు పార్వతికి సగం దేహం పంచి యిచ్చాడు కాదా. ఇంగ్లీషువాడు భార్యను 'బెటర్ హాఫ్' అంటాడు. అనగా పెళ్లాం మొగుడికన్న దొడ్డది అన్న మాట. బోధపడ్డదా?"

"నాకేం బోదకాదు బాబు?" రావుడికి నవ్వు ఆపుకోవడం అసాధ్యం కావచ్చింది.

"నీ కూతుర్ని బడికి పంపిస్తున్నాం కదా, విద్య యొక్క విలువ నీకే బోధపడుతుంది. మీ వాళ్లకంటె అప్పుడె దానికి ఎంత నాగరికత వొచ్చిందో చూడు,. ఆ మాట అలా వుణ్ణియ్యిగాని, యిప్పుడు ఇవ్వో నేనో వెంటనే బయల్దేరి చెంద్రవరం వెళ్లాలి? నే వెళ్లానికి శెలవు దొరకదు. నువ్వు తాతల నాటి నౌఖరివి. నీమీద కమలినికి యిష్టం. గనక నువ్వే వెళ్లడం మంచిది. వెళ్లి కమలినిని పిలుచుకు రా."

"శలవైతే యెల్నా, యెలతాను. ఆగ్రానం టే–"

"యిందు పది రూపాయలు. బతిమాలి తీసుకొస్తివట్టాయనా, మరి పది రూపాయలిస్తాను."

"సిత్తం."

"ఐతే, యేవిటి చెప్పాలో తెలుసునా?"

"యేటా, బాబూ? సెప్పకుండా లేసి రావడం మా మంచి పని సేసినారమ్మా. బాబు నా యిపు పగలేసినారు. రండి రండమ్మా అని సెప్తాను."

నన్ను క్షమించి దెబ్బ మాట మర్చిపో. కమలినితో ఎన్నడూ దెబ్బల మాట చెప్పబోకు. ఈ మాట జ్ఞాపకం వుంచుకుంటావు గదా?"

"సిత్తం"

"నువ్వు కమలినితో చెప్పవలసిన మాటలేవో, చెబుతాను బాగా చెవొగ్గి విను... పంతులికి బుద్ధి వొచ్చిందను..."

"అదేటి బాబు!"

నీకెందుకు? నే అన్న మాట గట్టిగా జ్ఞాపకం వుంచుకుని చెప్పు. పంతులికి బుద్ధి వొచ్చింది అను. మరి ఎన్నడూ సానుల పాట వినరు, గట్టి వొట్టు వేసుకున్నారు... (మరచిపోయి అన్నాను; ఆ మాట అనకు.)

యిటుపైని ఎన్నడూ, రాత్రిళ్లు యిల్లు కదలరు. ఇది ఖరారు. తెసిందా?"

రావుడు తల వూపాడు.

"ఇంకా ఏవిటంటే, గెడ్డం పట్టుకుని బతిమాలుకున్నానని చెప్పమన్నారు. దయదల్చి పంతుల లోపాలు బయట పెట్టొద్దన్నారు. (ఇది ముఖ్యమైన మాట. విన్నావా?) రెండు మూడు రోజుల్లో తప్పకుండా వెళ్లిపోయి రమ్మన్నారు. మీరు దగ్గర లేకపోవడంచేత వెఱ్ఱెత్తినట్టున్నారు. గడియో యేడు లాగ గదుపుతున్నారు. (యీ మాట మరవగలవు జాగర్త) యేం చెప్పాలో తెలిసింది గదా? ఒక్క మాటైనా మరచిపోకు."

"తెలిసింది బాబూ."

"యేం చెబుతావో నాకోమాటు చెప్పు."

రావుడు తల గోక్కుంటూ, "యేటా–యేటా – అదంత నాకేం తెల్దు బాబూ. నేనంతాను... అమ్మా నామాటినుకోండి. కాలం గడిపినోణ్ణి – పిన్నల్ని సూసినాను, పెద్దల్ని సూసినాను యిన్నరా? ఆడోరు యజమాని సెప్పినట్టల్లా ఇనీ వల్లకుండాలి. లేకుంటే, పెద్ద పంతుల్లోర్లాగ, సిన్న పంతులోరు కూడ సెడిపోతారు. మీ సెవ్వల్లో మాట. పట్టంలోకి బంగారం బొమ్మలాంటి సానెమ్మోరొస్సినారు. ఆ సానెమ్మోర్ని సూసినకాణ్ణుంచీ పంతులు మనసు, మసనులా నేదు. నా మాటిని రండి. లేకుంటే మీ సిత్తం, అంతాను."

"ఓరి వెధవా!" అని గోపాలుడు కోపంతో కుర్చీ మీంచి వురికాడు.

తప్పించుకుని రావుడు వూసలాగ గది పైకి దాటాడు.

అంతలో మంచం కింద నుంచి అమృతం వొలికే కలకల నవ్వూ, మనోహరియైన నూపురముల రొద, విననయ్యెను. ●

హైదరాబాద్ త్యాగరాయగానసభలో మానస ఆర్ట్ థియేటర్స్, సాధన స్రవంతి, గానసభల ఆధ్వర్యంలో జరిగిన సభలో డాక్టర్ కాశీనాధుని నాగేశ్వరరావుని సత్కరిస్తున్న శ్రీ పిరాట్ల వెంకటేశ్వర్లు. చిత్రంలో నరసింహాచారి, రఘుశ్రీ, పోతుకూచి సాంబశివరావు, దీక్షితులు ఉన్నారు.